సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 19 । ఆగస్టు । 2024



క్రీడా పరికరాలు కరువు 9లో▸

జిల్లాలోని ఆయా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. అయితే సరిపడా క్రీడా పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

భద్రకరణం తర్వాతే రక్షాబంధనం

ఆదిలాబాద్: రాఖీ పౌర్ణమి రోజున భద్రకరణం తర్వాతే రక్షాబంధనం చేయాలని పంచాంగకర్త శ్రీచికిలి వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతి ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం పౌర్ణమి తిథిన భద్రకరణం మధ్యాహ్నం 1.33 గంటల వరకు ఉందని తెలిపారు. అది పూర్తయిన తర్వాత నుంచి సాయంత్రం 6.40 గంటల వరకు సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టాలని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని వార్డు నం.33లో డెంగీ పాజిటివ్ కేసు నమోదు కావడంతో ఆదివారం ఆ ప్రాంతంలో డ్రైడేచ నిర్వహణతో పాటు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాలనీలో స్ప్రే చేయించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఆయన వెంట మలేరియా నివారణ అధికారి శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ సాయిరాం, సిబ్బంది అనిల్, ఉదయ్, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ, కామర్స్‌లో రెండు చొప్పున, తెలుగు, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. నెట్, సెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని, డెమో ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 22న అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

దుండగులను ఉరితీయాలి



మాట్లాడుతున్న విలాస్

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిని దారుణంగా హత్యచేసిన దుండగులను వెంటనే ఉరి తీయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. రిమ్స్‌లో గల యూనియన్ కార్యాలయంలో అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు సంగీత, ఖాసీంతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడారు. వైద్యులు భయపడొద్దని, అండగా ఉంటామని పేర్కొన్నారు. ఇందులో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజు, వెంకటేశ్, శ్రీను, కమలమ్మ, మంగమ్మ, నర్సింగ్ పాల్గొన్నారు.

అనుబంధాల.. రాఖీ



రాఖీ.. అన్నా చెల్లెలు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక. నేడు రక్షాబంధన్ పురస్కరించుకొని జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు వారి సోదరీమణులతో ఉన్న అనుబంధాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. దూరమెంత ఉన్నా తమ సోదరీమణులు తప్పకుండా రాఖీలు పంపుతారని.. ఆత్మీయతను చాటుతారని వివరించారు. – కైలాస్‌నగర్

మా అక్కలే నాకు స్ఫూర్తి



మాది రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్. నాకు ఇద్దరు అక్కలు. స్తుతిషా, స్మితి జైన్. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. రాఖీ పండుగ వచ్చిందంటే ఇల్లంతా హడావుడి ఉండేది. 2019 వరకు పండగను అందరం ఒకేచోట జరుపుకునేవాళ్లం. ప్రస్తుతం చాలా దూరంగా ఉండడంతో ఏటా రాఖీలను కొరియర్ ద్వారా పంపుతారు. వీడియో కాల్ ద్వారా సంతోషాలను సెలబ్రేట్ చేసుకుంటాం. మేమంతా ఏటా మూడు సార్లు తప్పకుండా కలుసుకునేలా ప్లాన్ చేసుకుంటాం. కోవిడ్ సమయంలో మాత్రమే కలుసుకోలేకపోయాం. సివిల్స్ ప్రిపరేషన్ సమయంలో నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. వారు ఉన్నతంగా ఎదిగేందుకు శ్రమించిన తీరు నాలో స్ఫూర్తి నింపింది. వారి ప్రేమ, అప్యాయత, అనుబంధాలను ఎప్పటికీ మరిచిపోను.

– రాజర్షి షా, కలెక్టర్

రాకున్నా రాఖీ పంపుతుంది..



మాది మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా కేంద్రం. నాకున్న ఒక్కగానొక్క సోదరి సిమాలీ. తాను ముంబాయిలో ప్రభుత్వ ఇంజినీర్. మహారాష్ట్రలో పనిచేసే సమయంలో ఇంటి వద్దే రాఖీ కట్టేది. పండుగను గ్రాండ్‌గా జరుపుకునేవాళ్లం. ప్రస్తుతం విధి నిర్వహణ రీత్యా ఇద్దరం దూర ప్రాంతాల్లో ఉన్నా పండుగకు తప్పకుండా రాఖీ పంపుతుంది. వీడియో కాల్ ద్వారా శుభాకాంక్షలు చెబుతుంది. ఆమె పంపించిన రాఖీ కట్టుకోవడం ద్వారా దూరంగా లేదనే బావన కలుగుతుంది.

–ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీఎఫ్‌వో

అందరినీ ఆత్మీయులుగా భావించాలి



అశోక్‌కు రాఖీ కడుతున్న ఫార్మసిస్టు హారిక

మాది హైదరాబాద్. నాకు ఇద్దరు అక్కలు. పెద్దక్క మంజుల హైదరాబాద్‌లో, చిన్నక్క మాధవి సూర్యాపేటలో ఉంటారు. ఉద్యోగ రీత్యా నేను దూరంగా ఉండటంతో వారు ఒక్కోసారి స్వయంగా రాకపోయినా మమకారాన్ని చాటేలా రాఖీలు పంపుతారు. ఏదైన ప్రత్యేక సందర్భంలో కలిసినప్పుడు అదే పండుగలా భావించి ఆనందంగా గడుపుతాం. ప్రతి మహిళను సోదరి గానే పరిగణించాలి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో పనిచేసే ఆడపడుచులను గౌరవిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి. రక్షాబంధన్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారా ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యపడుతుంది.

– అశోక్ కుమార్, జైలు సూపరింటెండెంట్



మావల మండల కేంద్రంలోని అనుమతి లేని అవుట్

ఎల్‌ఆర్‌ఎస్.. ముందడుగు

- దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేకాధికారులు
- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి నియామకం
- నేటి నుంచి అందుబాటులోకి హెల్ప్‌డెస్క్‌లు

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన దరఖాస్తుల వివరాలు
మొత్తం బ్లాక్‌లు: 08
అందిన దరఖాస్తులు : 19,430
ప్రాసెస్‌లో ఉన్నవి : 7,448
తిరస్కరణకు గురైనవి : 17
ఫీజు చెల్లించాలని సమాచారమిచ్చినవి : 2781
ఫీజు చెల్లించినవి : 1847
ఆమోదించినవి : 17

కైలాస్‌నగర్: లేఅవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ(ఎల్ఆర్ఎస్)కు ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ముందడుగు పడింది. ఈ స్కీం కింద అందిన దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల ద్వారా సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే బల్దియాలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రక్రియకు అవరోధం కలగకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ప్రత్యేకంగా అధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారులు ప్రక్రియకు అవసరమైన పత్రాలను పూర్తిస్థాయిలో అందించనట్లుగా గుర్తించారు. వాటిని అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించారు. అంతేకాకుండా దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తికి గాను ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్టర్ చేసుకుని అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించింది. అయితే ఆదిలాబాద్ బల్దియాలో తగినంత సిబ్బంది లేకపోవడంతో రెవెన్యూశాఖకు సంబంధించి తొమ్మిది మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) స్థాయి, ఇరిగేషన్‌కు సంబంధించి ఐదుగురు ఏఈ స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ 14 మంది అధికారులు బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నారు. ఈ ప్రక్రియపై సోమవారం రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఇందులో ఏ విధంగా పరిశీలన చేపట్టాలనే దానిపై సూచనలు చేయనున్నట్లుగా తెలిసింది. ఆ ప్రకారం అధికారులు ముందుకు సాగనున్నారు. ఇక దరఖాస్తుదారులు దరఖాస్తు సమయంలో సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ వాల్యూ ధ్రువీకరణ పత్రం, లే అవుట్ కాపీ వంటి డాక్యుమెంట్స్‌ను ఇవ్వని పక్షంలో వాటిని అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి బల్దియా అధికారులకు ఆధికారులను కట్టబెట్టింది.

ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు

ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు సంబంధించి దరఖాస్తుదారుల్లో ఉన్న సందేహాల నివృత్తితో పాటు సలహాలు,సూచనలు అందించేందుకు హెల్ప్‌డెస్కుల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపల్ కార్యాలయంతోపాటు కలెక్టర్ కార్యాలయంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. నేటి నుంచి అందుబాటులోకి రానున్నట్లుగా బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత తెలిపారు. దరఖాస్తు దా రులు వీటిని సద్వినియోగం చేసుకుని ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించుకోవచ్చని సూచించా రు. మంగళ, బుధవారం నుంచి దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభమయ్యే అవకాశముందని వెల్లడించారు. ఈ ప్రక్రియ చేపట్టడం ద్వారా బల్దియా ఖజానాకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరే అవకాశముంది.

ఓటరు నమోదుకు మరో అవకాశం

- మార్పులు, చేర్పులకు కూడా...
- రేపటి నుంచి బీఎల్‌వోల ఇంటింటి సందర్శన

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓట్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆదిలాబాద్	1,19,848	1,25,283	06
బోథ్	1,02,458	1,08,852	03

నిర్దేశిత దరఖాస్తు ఫారాలు ఇలా..
ఫారం – 6 : కొత్తగా ఓటరు నమోదు కోసం
ఫారం – 6బి : ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం
ఫారం – 7 : జాబితా నుంచి పేర్ల తొలగింపునకు
ఫారం – 8 : జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు



కైలాస్‌నగర్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపడుతుంది. ఇందులో భాగంగా ఓటర్ల నమోదు కోసం తాజాగా మరో అవకాశం కల్పిస్తోంది. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకునేలా ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఈ నెల 20 నుంచి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సవరించనున్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటరు నమోదుపై యంత్రాంగం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడితే మరింత మంది యువత ఓటు హక్కు పొందేందుకు అవకాశముంటుంది.

రేపటి నుంచి ఇంటింటి సందర్శన

ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు రేపటి నుంచి తమ పరిధిలోని ఇంటింటి సందర్శన చేపట్టనున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేస్తారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించనున్నారు. అలాగే ఓటర్లకు సంబంధించిన ఏదైనా సమాచారం తప్పుగా ఉన్నా, చిరునామాలో మార్పులు చేర్పులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా తగు చర్యలు చేపడుతారు. జాబితాలో ఫొటో లేనట్లయితే దానిని సేకరించి మార్పులు చేస్తారు. పోలింగ్ కేంద్రాలను సైతం మార్చుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ ప్రక్రియ అక్టోబర్ 18వ వరకు సంబంధిత మండలాల రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో కొనసాగనుంది. ఇందులో సేకరించిన వివరాల ప్రకారం అక్టోబర్ 28వ రకు తగు మార్పులు, చేర్పులతో పాటు వివరాలు సరిచేసి 29న ముసాయిదా జాబితా ప్రకటించనున్నారు. నవంబర్ 28వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వాటిని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన శని, ఆదివారాల్లో చర్యలు చేపట్టనున్నారు.

అవగాహన కల్పిస్తే ప్రయోజనం

ఇప్పటికే పంచాయతీ ఎన్నికల కసరత్తు షురూ కాగా త్వరలోనే ఎన్నికల నగారా మోగే అవకాశం కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల అనంతరం మండల, జిల్లా పరిషత్ స్థానాలకు సంబంధించిన ఎన్నికలు జరగనున్నాయి. ఇలా వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు రానుండటంతో యువత ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆ దిశగా వారిలో అవగాహన కల్పించేలా యంత్రాంగం తగు చర్యలు చేపట్టినట్లయితే కొత్త ఓటర్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశముందనే అభిప్రాయం రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతుంది. ఆ దిశగా యంత్రాంగం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని డిగ్రీ, బీఎడ్, డీఎడ్ వంటి కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి యువతను చైతన్యవంతులను చేసినట్లైతే వారు ఓటు హక్కు పొందనున్నారు.

పాపన్నగౌడ్ సేవలు మరువలేనివి

- కలెక్టర్ రాజర్షి షా
- ఘనంగా 'సర్వాయి' జయంతి వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు జరిగిన అన్యాయంపై నాడు నిజాంతో పోరాడిన యోధుడు సర్వాయి పాపన్నగౌడ్ అని, ఆ మహనీయుని సేవలు మరువలేనివని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం అధికారికంగా నిర్వహించారు. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అందరికి సమాన అవకాశాలు ఉండాలని ఆకాంక్షించిన వ్యక్తి పాపన్నగౌడ్ అని అన్నారు. ఆయన పోరాటాలు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఏటా పాపన్నగౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, అదనపు ఎస్పీ సురేందర్, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రకాశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు సంతోష్ గౌడ్, నర్సాగౌడ్, దినేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..



మున్నూరుకాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో..



ఇంద్రవెల్లిలో.

కొవ్వొత్తుల ప్రదర్శనలు

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని దారుణ హత్యను నిరసిస్తూ టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ డాక్టర్ల నిరసనకు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్, కోశాధికారి కె.కిష్టన్న, కార్యదర్శులు ఎ.ఇస్తారి, శ్రీనివాస్, గౌస్ మొహియుద్దీన్, సి.విలాస్, శివన్న, శంకర్, మహిళా ప్రతినిధులు శ్రీలత, ఆర్.మీరా, డి.రజిని, అనిత, శ్రీవాణి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్‌రూరల్: మున్నూరుకాపు మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సంఘం తాలుకా అధ్యక్షురాలు ప్రభ, ప్రధాన కార్యదర్శి జోగు రమణి, మున్నూరు కాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొళ్ల విఠల్, కలాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి: కోల్‌కతాలో వైద్యవిద్యార్థినిని హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో పలు పార్టీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పుష్పలత, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావ్, సోన్‌కాంబ్లే మనోహర్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి
- ఇంటింటా ఫీవర్ సర్వే చేపడుతున్నాం
- వైద్యాధికారులు సమయపాలన పాటించాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో కృష్ణారావు



కృష్ణారావు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

ఆదిలాబాద్‌టౌన్: 'ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి.. వైద్యులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలి.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు..' అని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణారావు స్పష్టం చేశారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. వర్షాకాలం కావడంతో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు. ఏజెన్సీ ప్రాంతాలపై ఫోకస్ పెంచుతామని తెలిపారు. ప్రస్తుతం ఇంటింటా ఫీవర్ సర్వే చేపడుతున్నామని వెల్లడించారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే.

సాక్షి: జిల్లాలో ప్రస్తుతం డెంగీ వంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి.. వీటి నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతారు?

డీఎంహెచ్‌వో: జిల్లాలో డెంగీ నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడతాం. ప్రైవేట్ ఆస్పత్రులు డెంగీ పేరిట ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు. అనుమానం ఉన్న రోగులకు రిమ్స్‌లో పరీక్షలు చేయించాలి. జిల్లాలో ఈనెలలో ఇప్పటివరకు 23 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 58 వరకు నిర్ధారణ అయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల వారు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయరాదు. ఒకవేళ చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు.

సాక్షి: సీజనల్ వ్యాధుల నివారణకు ఏదైనా ప్రణాళిక రూపొందిస్తున్నారా..?

డీఎంహెచ్‌వో: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆయా శాఖల సమన్వయంతో ముందుకు సాగుతాం. ఇప్పటికే ఇంటింటా ఫీవర్ సర్వే చేపడుతున్నాం. అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశాం. వైద్యాధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా చర్యలు చేపడుతున్నాం.

సాక్షి: ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఏమైనా ఉందా..?

డీఎంహెచ్‌వో: జిల్లాలో 52 పోస్టులకు గాను 33మంది వైద్యాధికారులు పనిచేస్తున్నారు. 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు పలు ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వాటి భర్తీకి చర్యలు చేపడతాం.

సాక్షి: జిల్లాలో మందుల కొరత ఏమైనా ఉందా..?

డీఎంహెచ్‌వో: సీజనల్ కాలం కావడంతో ముందస్తుగానే డ్రగ్ స్టోరేజీలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాం. ఎలాంటి కొరత లేదు. ఓఆర్ఎస్, జింక్, మెట్రోజిల్ మాత్రలను అందుబాటులో ఉంచాం. ఇంకెక్కడైనా మందులు లేకపోతే సరఫరా చేస్తాం.

సాక్షి: వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారా..?

డీఎంహెచ్‌వో: క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నాం. సీజనల్ కాలం కావడంతో చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. రిమ్స్‌తో పాటు ఆయా పీహెచ్‌సీల్లో జ్వర బాధితుల సంఖ్య పెరిగింది.

సాక్షి: ప్రైవేట్ ఆస్పత్రుల వారు అనవసర టెస్టుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.. దీనిపై మీ స్పందన?

డీఎంహెచ్‌వో: నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు చేపడతాం. అర్హతగల వైద్యులు, సిబ్బందితోనే వైద్య సేవలు అందించాలి. వైద్యాధికారులతో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులన్నీ తనిఖీ చేయిస్తున్నాం. ప్రతీ ఆస్పత్రికి ఫైర్ సేఫ్టీ, ఫీజు బోర్డును ప్రదర్శించాలి. ఎవరైనా విజిట్ డాక్టర్లు వస్తే వారి వివరాలను సైతం వైద్యశాఖ కార్యాలయంలో సమాచారం అందించాలి. రిమ్స్‌లోనే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలి. రోగులను భయభ్రాంతులకు గురిచేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

నవజాత శిశువు మృతిపై కలెక్టర్ ఆరా

ఉట్నూర్‌రూరల్: నార్నూర్ మండలం ఏం పల్లి గ్రామానికి చెందిన గర్భిణి దుర్గుబాయి 108లో నార్నూర్ నుంచి ఉట్నూర్‌కు తరలిస్తుండగా ప్రసవించింది. బాబుకు జన్మనివ్వగా నవజాత శిశువు మృతిచెందాడు. ఈ ఘటనపై '108లో మహిళ ప్రసవం మగ శిశువు మృతి' శీర్షికన ఆదివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. సమగ్ర నివేదికను అందించాలని జిల్లా వైద్యాధికారి కృష్ణను ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యుడి ద్వారా గర్భిణి సమాచారం సేకరించి కలెక్టర్‌కు నివేదికను అందజేశారు.

అమ్మవారి సన్నిధిలో పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మనోహరెడ్డి కుటుంబ సభ్యులు

బాసర: బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారిని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె మనోహరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు అచ్యుత్ వారికి తీర్థప్రసాదం అందజేశారు. మాజీ సర్పంచ్ పి.సతీశ్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్నల సాయినాథ్ పటేల్, నాయకుడు గణేశ్ చవాన్ ఉన్నారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలో చికెన్ సెంటర్ గల్లీలో శనివారం సాయంత్రం గుడ్‌మార్నింగ్ బేకరి యజమాని షేక్ జునేద్‌ని ఇచ్చోడకు చెందిన తుమ్మల సతీశ్‌రెడ్డి కత్తితో దాడి చేసి గాయపర్చాడు. బేకరి వద్ద సిగరెట్ కొనుగోలు విషయమై గొడవ జరిగింది. బాధితుడు ఫిర్యాదుతో సతీశ్‌రెడ్డిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని సోమవార్‌పేట్‌లో గల ఓ ఇంట్లో అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులంతా ఉక్కపోత భరించలేక శనివారం రాత్రి ఇంటి ప్రధాన ద్వారానికి తాళం వేసి మొదటి అంతస్తులో నిద్రించారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. బీరువాలో 2 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.48 వేల నగదు ఎత్తుకెళ్లారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమెరికా నుంచి వచ్చి..



నేను మంచిర్యాల నుంచి పెళ్లి తర్వాత ఉద్యోగరిత్యా భర్తతో అమెరికా వెళ్లాను. తమ్ముడు దినేష్‌కు రెండేళ్లుగా నేరుగా రాఖీ కట్టలేదు. పండుగలోపు రాఖీని కొని పంపించేదాన్ని. ఈ ఏడాది ఎలాగైనా రాఖీ కట్టాలని మంచిర్యాలకు వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టేందుకు ఎదురుచూస్తున్నాను.

– చిటుమల్ల దివ్య, కాలిఫోర్నియా, అమెరికా

అన్నయ్యపై ప్రేమతో వస్తున్నా



బెల్లంపల్లి: మాది నెన్నెల మండలం గొల్లపల్లి స్వగ్రామం. నాకు పెళ్లై 9 ఏళ్లు కావస్తోంది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నారు. ఏటా రాఖీ పండుగకు నేను ఎక్కడున్నా సోదరుడు రమేశ్ వద్దకు వచ్చి రాఖీ కట్టడం నాకెంతో ఇష్టం. తోబుట్టువుపై ఉన్న ప్రేమతో పండుగకు ఒకరోజు ముందుగా ఇంటికి వచ్చాను.

– గంద్ర సుమలత, హైదరాబాద్

తమ్ముడికి రాఖీ కట్టడానికి వచ్చాను



తమ్ముడికి రాఖీ కట్టడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ప్రత్యేకంగా సెలవు తీసుకుని నెన్నెలలో ఇంటికి వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టి పండుగ జరుపుకుంటాం.– చిన్నోజు నిహారిక, నెన్నెల

పండుగకు ఇంటికొస్తా



ప్రస్తుతం నేను వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఇద్దరు అన్నలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. రాఖీ పండుగ రోజు ఇంటికి వచ్చి పండుగ జరుపుకోవడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిది. – గొల్ల శిరీష, వరంగల్, మాదారం

రక్షా'బంధం'



- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక
- నేడు రాఖీపౌర్ణమి

ఏటా శ్రావణమాసంలో వచ్చేపౌర్ణమి తిథి రోజు రాఖీ జరుపుకుంటారు. శాస్త్రప్రకారం భద్రకాలం ముగిసిన తర్వాత రాఖీ కట్టాలి. ఈ తిథుల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి సోమవారం తెల్లవారుజాము 3:04 గంటలకు ప్రారంభమై రాత్రి 11:55కు ముగుస్తుంది. అయితే ఆ మధ్యలో భద్రకాలం ఉదయం 5:53 నుంచి మధ్యాహ్నం 1:32 గంటల వరకు సోదరులకు రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. మిగిలిన సమయంలో రాఖీలు కట్టవచ్చని పేర్కొంటున్నారు.

కెరమెరి(ఆసిఫాబాద్): 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి..కనిపించే దైవమే ఆ కనులలో సన్నిధి'అని ఓ చెల్లి తన సోదరుడి గురించి పాట పాడడంలో ఎంతో అర్థం ఉంది. తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే అన్నయ్యలంటే ప్రతీ చెల్లికి అభిమానమే. సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షా'బంధనం'. ఇంటి ఆడపడుచు మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్టసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్న భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి, వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని నేడు ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపిస్తారు. తర్వాత వారు కానుకలు ఇస్తారు. ఇది వారి ప్రేమ, అనురాగానికి వారధిగా నిలుస్తుంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు ఆత్మీయులకు పోస్టు ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా రాఖీలను పంపారు. భారతీయ ధర్మశాస్త్రాల్లో తెలిపిన రక్షాబంధన్ రోజున సోదరునికి తిలకధారణ గావించి అక్షింతలతో ఆశీర్వదించి రక్షణ కవచాన్ని కడుతుంది. ఇది దేవతారక్షగా కాపాడుతుందని వారి నమ్మకం.

దేవతల కాలం నుంచి..

శ్రీరామునికి కౌసల్య రాఖీ కట్టిందని, రాక్షసుడు విష్ణు భక్తుడైన బలికి మహాలక్ష్మి రాఖీ కట్టి మృత్యువు నుంచి కాపాడిందని, శకుంతల తన గారాల కొడుకు భరతునికి శత్రుభయం లేకుండా తాయిత్తు కట్టిందని కథలు ఉన్నాయి. దేవేంద్రుడు సకల రాక్షసుల మధ్య 12 ఏళ్లు మహాయుద్ధం జరిగింది. ఈ సందర్భంలో రాక్షస రాజు ముల్లోకాలను జయించాడు. పరిస్థితిని గుర్తించిన బృహస్పతి ఇంద్రునికి విజయం కలగాలని ఇంద్రాణితో రక్ష కట్టించాడు. ఇది శ్రావణపౌర్ణమి రోజు వేద పండితుల మంత్రోచ్చారణలో జరిగిందని పురాణాలు చెబుతున్నాయి.

రాజుల కాలం నుంచి..

రాజుల కాలం నుంచి రక్షాబంధం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా పురుషోత్తమునికి రక్షా సూత్రం కట్టినందుకే అతన్ని విడిచిపెట్టాడు. హుమాయూన్ చక్రవర్తి రాణి కర్ణావతి రాఖీ పంపించి అతడి రక్షా పొందింది. ఛత్రపతి శివాజీ భవానిదేవి ప్రసాదించిన ఖడ్గాన్ని పొంది వేద ధర్మరక్షణలకు ప్రతిన చేస్తూ రక్షా ధరించారనే కథలు ప్రచారంలో ఉన్నాయి. శ్రావణపౌర్ణమిన రాఖీ కట్టడం వల్ల తల్లీబిడ్డకు, భార్యభర్తలకు తొలి దశ ఏర్పడింది. మలిదశలో సోదరీ సోదరునికి రక్షా కట్టడం జరిగింది. ఈ కాలంలో ప్రతీ మహిళా తనకు పరిచయం ఉన్న పురుషునికి సోదరభావంతో రాఖీ కట్టడం, రాఖీ పంపడం, రాఖీని అందుకున్న పురుషుడు ఆమెను సోదరిగా బహుమతులివ్వడం ఆనవాయితీగా వస్తోంది.

అన్నయ్య అంటే ఇష్టం



మంచిర్యాలటౌన్: మా అన్నయ్య సాయికృష్ణ గౌడ్ అంటే చాలా ఇష్టం. ఉద్యోగరీత్యా అన్నయ్య ఓ చోట, నేను హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. నేను, అన్నయ్య మంచిర్యాలకు వచ్చాం. పండుగ రోజున అన్నయ్య రాఖీ కడుతాను.

– బొడిగె దీప్తిగౌడ్, బీటెక్ థర్డియర్, మంచిర్యాల

ఎక్కడున్నా తమ్మునికి రాఖీ కట్టుడే



హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. చిన్ననాటి నుంచి తమ్ముడు శ్రీచరణ్‌కు రాఖీ కడుతున్నాను. చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరినా పండుగకు ఇంటికి వచ్చి, తమ్మునికి రాఖీ కడుతుంటాను. సెలవులు రావడంతో రెండు రోజులు ముందుగానే మంచిర్యాలకు వచ్చాను. – చిలువేరు శ్రీనిజ, మంచిర్యాల

రాఖీ కట్టి యూఎస్ వెళ్లి..



నేనే ఈ ఏడాది బీటెక్ పూర్తిచేశాను. ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాల్సి వచ్చింది. రెండురోజుల ముందే తమ్ముడు చరిత్‌కు రాఖీ కట్టాను. ఈ ఏడాది మాత్రం రాఖీని రెండురోజుల ముందే కట్టి వెళ్లాను.

– ముత్యాల సంహిత, మంచిర్యాల

విడదీయని బంధం



ఆసిఫాబాద్‌అర్బన్: రాఖీ పండుగ సోదర భావాన్ని గుర్తుచేస్తుంది. అన్నాచెల్లెళ్లు, అక్కల బంధం జీవితంలో విడదీయరానిది. ప్రతిఏటా మహారాష్ట్రలోని పుణెలో ఉన్న మా సోదరులకు రాఖీ కడుతాను. అదేవిధంగా అక్కాచెల్లెలు లేనివారికి రాఖీ కట్టడం ఎంతో తృప్తినిస్తుంది.

– సిద్దెంశెట్టి సుహాసిని, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు

అన్నాదమ్ములంటే ఓ భరోసా



అమ్మలోని మొదటి అక్షరం..నాన్నలోని రెండవ అక్షరం కలిపితే ఏర్పడేది అన్నయ్య. నేను పోలీసుశాఖలో పనిచేస్తున్నా. కాగజ్‌నగర్‌లో ఉంటున్న తన అన్నయ్యకు రాఖీ కట్టడం ధైర్యాన్నిస్తుంది. రాఖీ పండుగ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. – సునీత, సీటీం హెడ్ కానిస్టేబుల్, ఆసిఫాబాద్

పండగంటే ఇష్టం

ప్రతిఏటా ఆసిఫాబాద్‌లో ఉంటున్న అమ్మానాన్నల సమక్షంలో రాఖీ పండుగను చేసుకుంటాం. అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తాం. అన్నయ్యకు రాఖీ కట్టడంతో మంచి జరుగుతుందని ఎంతో నమ్మకం. నాన్న రంగుల రాఖీలు తీసుకువస్తాడు. ఈ పండుగ అంటే ఇష్టం. – తాటిపల్లి ఈశ్వర్, శ్రేష్ఠ, అన్నాచెల్లెలు, వరంగల్

ఎన్ని పనులున్నా వెళ్తా..

మా ఊరు చెన్నూర్. వివాహం తర్వాత హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాం. ఎన్ని పనులు ఉన్నా సొంత ఊరికి వెళ్తాను. అన్నయ్యకు రాఖీ కట్టి అతను ఇచ్చే కానుకలను భద్రంగా దాచుకుంటాను. స్నేహితులు, బంధువులకు చూపించి సంతోషిస్తాను.

– అభిలాష్‌కు రాఖీ కడుతున్న చెల్లెలు స్వప్న

ఉద్యోగానికి లీవ్ పెట్టి

వృత్తిరీత్యా కరీంనగర్. హైదరాబాద్‌లో ఉంటాం. రాఖీ పండుగ వస్తే కరీంనగర్‌లో ఉన్న చెల్లి బుగ్గారపు హర్షిని వద్దకు వెళ్లి రాఖీ కట్టుకుంటాం. ఎంత పని ఉన్నా లీవ్ పెట్టి అక్కడకు వెళ్తాను. రాఖీ పండుగకు తీసిన ఫొటోలను భద్రంగా దాచుకుంటాను.

– హర్షిని, సంగనబట్ల రేవంత్, భరత్‌కుమార్



శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న రాధ

తోడబుట్టకపోయినా అన్నాచెల్లెళ్లమే

నిర్మల్: వాళ్లిద్దరు తోడబుట్టకపోయినా అన్నాచెల్లెళ్లే. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్న రాధ, అదే ఆస్పత్రిలో ఆరోగ్యమిత్రగా చేస్తున్న కొటిక శ్రీనివాస్‌లు అన్నాచెల్లెలుగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. శ్రీనివాస్ తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత తన ఆస్పత్రిలోనే నర్సుగా చేసే రాధ ప్రతిరోజూ భోజనం తీసుకువచ్చేది. ఆయన పెళ్లి చేయడంలోనూ, భార్య పద్మ గర్భవతి అయినప్పుడూ తను పూర్తి బాధ్యత తీసుకుని డెలివరీ చేయించింది.

అన్నలా చూసుకుంటాడు

నాకు తోడబుట్టిన అన్నతమ్ముడు లేరు. శ్రీనన్ననే నాకు తోడబుట్టిన అన్న లాగా చూసుకుంటాడు. ప్రతీ ఏడాది రాఖీ పండుగకు అన్న ఎక్కడ ఉన్నా.. కచ్చితంగా రాఖీ కడతాను. – రాధ, నిర్మల్



గుంటూరు నుంచి అక్కవద్దకు వచ్చిన డాక్టర్ నరేశ్

450 కి.మీ. దూరం నుంచి..

అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని దూరాలు వేరు చేయలేవనడానికి వీరే ఉదాహరణ. అక్కతో రాఖీ కట్టించుకోవడానికి తమ్ముడు 450 కి.మీ దూరం నుంచి వచ్చాడు. జిల్లా కేంద్రానికి చెందిన గైనకాలజిస్ట్ చంద్రిక సొంతూరు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల. నిర్మల్‌కు చెందిన డాక్టర్ అవినాశ్‌ను పెళ్లిచేసుకున్న తర్వాత ఇక్కడికి వచ్చారు. ఆమె సోదరుడు డాక్టర్ నరేశ్ గుంటూరులో క్రిటికల్‌కేర్ వైద్యుడిగా స్థిరపడ్డారు. రాఖీ పండుగ కోసం ఆయన నిర్మల్ వచ్చారు.

అనుబంధానికి ప్రతీక

రక్షాబంధన్ అంటేనే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక. మా తమ్ముడు డాక్టర్ నరేశ్ అంతదూరం నుంచి నా కోసం రావడం చాలా సంతోషంగా అనిపిస్తుంది. రాఖీ పండుగ అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. – డాక్టర్ చంద్రిక, నిర్మల్

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పిట్టలవాడ కాలనీకి చెందిన ద్యానంగుల హన్మంతు అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పనికి వెళ్తానని చెప్పి రోజులాగే ఈనెల 16న ఇంటి నుంచి బయల్దేరి వెళ్లి రాత్రి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబీకులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా దొరకలేదు. భార్య రేఖ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

బోథ్: మండలంలోని నిగినీ గ్రామానికి చెందిన మట్ట సరస్వతి (17) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. డబ్బుల విషయంపై కుటుంబ సభ్యులు మందలించడంతో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సై పేరిట వ్యాపారులకు ఫేక్ ఫోన్ కాల్స్

ఆదిలాబాద్‌టౌన్: కొందరు అపరిచితులు వన్‌టౌన్ ఎస్సై అని చెబుతూ వ్యాపారులకు ఫేక్ ఫోన్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సీఐ సునీల్ కుమార్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని బంగారు దుకాణాల యజమానులకు ఫోన్ చేసి బంగారం సంబంధించి పాత కేసు ఉందని, స్టేషన్‌కు రావాలని చెబుతున్నారని పేర్కొన్నారు. వీడియోలు పంపుతానని, వచ్చి సెటిల్మెంట్ చేసుకోవాలని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. వ్యాపారులెవరు అలాంటి ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని సూచించారు. ఎవరైన ఫోన్ చేస్తే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వివరించారు. ఇటీవల వ్యాపారులకు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



అజ్మీర రాజేశ్ మృతదేహం

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన రైతు అజ్మీర రాజేశ్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. అజ్మీర రాజేశ్ తన పొలంలో గడ్డి కోసే యంత్రంతో ఆదివారం గడ్డిని కోస్తున్నాడు. ఈక్రమంలో విద్యుత్ స్తంభం నుంచి వచ్చే త్రీఫేజ్ వైరు కట్ అయి రైతు చేతివేళ్లపై పడింది. విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడ మృతిచెందాడు. పక్కన ఉన్న రైతు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడకి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య శ్రీవాణి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాపు చేస్తున్నట్లు తెలిపారు.



నిర్మల్‌లో కొంగల సందడి



మహబూబ్ ఘాట్ రోడ్డు ఏరియల్ వ్యూ

జ్ఞాపకాలు పదిలం..

ఒక్క ఫొటో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ చిత్రం చూడగానే గత స్మృతులు మనసులో మెదలుతాయి. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులు బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్ సాక్షి ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలు. - సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్/నిర్మల్



ఎరుపు, ఆకుపచ్చ రంగులతో చెట్లు



రోడ్డుపై పచ్చని పందిరి కింద నుంచి వెళ్తూ..



ఆదిలాబాద్ జిల్లా సలాయిగూడలో ఆదివాసీల జీవన చిత్రం



ఒంపుసొంపుల జాతీయ రహదారి..దేవాపూర్ చెక్‌పోస్టు ప్రాంతంలో..

అ'పూర్వ' సమ్మేళనం



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో 2004-05, సృజన విద్యాలయం పాఠశాలలో చదివిన 2014-15 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలల్లో నిర్వహించిన అపూర్వ సమ్మేళనాలకు వారు హాజరయ్యారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సృజన పాఠశాల పూర్వ విద్యార్థులు